# చలో హైదరాబాద్

శ్రీ "విపంచి"

రావు తెల్లారకుండానే వచ్చాడు. అసలు ఎనిమిదయినా లేచే ఘటం కాదు వాడిది. ఇవాళ ఏదో పుట్టిమునిగిందిరా బాబూ అనుకున్నా. వస్తూనే పత్రిక నామీద విసిరికొట్టి "నే చెప్తే విన్నావా? దేశద్రోహులు!" అన్నాడు. "ఎవరు ద్రోహులు ఏం దేశం, అసలు సంగతేమిటి". ఏమీ చెప్పేట్టులేడు. అతని ముఖం చూస్తే చెప్తే వినేటట్టుకూడా కనిపించలా. నే పత్రిక చేత్తో పట్టుకుని "కాఫీ తాగుదాం రారా" అంటూనే హోటలుకు దారితీశా. ఏకళనున్నాడో వాడూ బయల్దేరాడు. వాడసలు వాగుడుపిట్ట - మరేమో ఈరోజు అసలు మాట్లాడడమే లేదు. నడుస్తూనే పేపరు హెడ్ లైన్సు చూస్తున్నా. "ఓస్. ఇదా సంగతి" అనుకుని నాలో నేనే నవ్వుకుంటున్నా. నా ముఖం చూస్తూ చురచురమంటున్నాడు రావు.

మేం లోపలికి పోయేసరికి మూర్తి అప్పుడే రెండోపడిలో ఉన్నాడు. రావు ఇంత త్వరగా లేచేడే అన్నట్లు తలకాయూపుతూ ఆహ్వానించాడు. మేం ఇడ్లీ తీసుకుంటూండగానే లాయరుగారు వచ్చారు. ఇంకా ఆయన కూచోకముందే "పేపరు చూశారా?" అన్నారు రావు. "చూస్తాలెండి ... రండి కూర్చోండి ... ఏమోయ్ పంతులూ ... ఇంకో ప్లేటు ఇడ్లీ" నేను ఇంకా పూర్తిగా అనకముందే చూశారా! మన వాళ్ళెప్పుడూ ఇంతేనండి. రంగాగారు చెపితే ఆయనంతా న్యూఢిల్లీ వాతావరణంఅంటారు. కళ్ళున్నా చూడరు..." అంటూ దండయాత్ర ప్రారంభించారు.

రావు, మూర్తి, నేను కలిసి చదువుకున్నాం. లాయరుగారు మాకు చాలా సీనియరు. ఆయనకు—మాకు చిన్నతనం నుంచీ జోస్తీ. మూర్తి యింటరు పూర్తి కాకుండానే నేవీలో చేరాడు. నేను తాలూకాఫీసులో జేరాను. రావుకు ఉద్యోగం చెయ్యాల్సిన ఖర్మలేదు. మాలో రావే చదువుకునే రోజులనుంచి రాజకీయాలని సాంఘికాలని వెంపరలాడేవాడు.

క్రితం సంవత్సరం శెలవలకు మూర్తి వచ్చేదాక మా నలుగురిలో భేదాభిప్రాయాలు లేవు. వాడొచ్చి తెచ్చాడీ ముప్పంతా "నావికుల తిరుగుబాటుకు కాంగ్రెసువారు సహాయం చేయకపోతే మానే; కనీసం అధికారంలోకి వచ్చిన

కాంగ్రెసు నాయకులు తిరుగుబాటు చేశారని శిక్షలు అమలుచేస్తు"న్నా"రన్నాడు మూర్తి. అంతవరకు రావుకూడా ఏకీభవించాడు. కాని మూర్తి "కమ్యూనిస్టులు రక్తధార పోశారు. ఎప్పుడైనా మోక్షం వస్తే వారివల్లే" అన్నాడు. దాంతో చాలా రభస జరిగింది. "ఛస్తే ఒప్పుకోన"న్నాడు" రావు. "ఇంపాసిబుల్ – ఇంప్రాబబుల్" అన్నారు లాయరుగారు. "ఆటేచూస్తే కమ్యూనిస్టులు నావికుల తరఫున కొంతవరకు నిలబడ్డట్టే వుంది. అయినా నిజం నిలకడమీద తెలుస్తుంద"న్నాను నేను. మూర్తి ఎంతచెప్పినా రావు వినిపించుకోలేదు "కమ్యూనిస్టులా! ద్రోహం!! 42 విషయం ఏమంటావు" అంటాడు రావు. "తరచి చూస్తే 42 లో కూడా వారే కరెక్టేమో? ఆ విషయం పూర్తిగా తేల్చాలి" అన్నాడు మూర్తి. దాంతో లాయరుగారు అడ్డొచ్చి "మనకెందుకు రాజకీయాలు" అని వాతావరణం చల్లబర్చేవాడు ఇది సంవత్సరంనాటి విషయం.

మూర్తి శెలవలయిపోగానే బొంబాయి వెళ్ళిపోయాడు లాయరుగారు ప్రాక్టీసు ఎలా అభివృద్ధిచేయాలా అని ఆలోచిస్తున్నారు. రావు ఏదో స్వాతంత్ర్యాన్ని రక్షించాలని - ఏమేమో చెప్తూనే ఉన్నాడు. "గడ్డురోజులు. రెండువేళ్ళూ నోట్లోకి వెళ్ళడమే కష్టంగావుంది. ఈ బ్లాక్ మార్కెట్టుతో కుచేల సంతానానికి తిండీ బట్టకీ - చాలని మా గుమాస్తాలంతా అన్నారు. "ఇదంతా కమ్యూనిస్టుల తంతు. ప్రభుత్వాన్ని పడగొట్టాలని ఎత్తేశార"న్నాడు రావుకూడా.

నిజానికి నాకు భలే కోపం వచ్చింది. నాకు ప్రత్యేకించి కమ్యూనిస్టు మిత్రులెవరూ లేరు. నాకు తెలిసినంతల్లా రావు మిత్రుడు శ్రీహరి ఒక్కడే. మాకు జీతాలు చాలక ఇంకో రెండు రాళ్ళిమ్మంటే అది కమ్యూనిస్టుల దేశద్రోహంగా ప్రచారం చేశారు దేశభక్తులు. నన్ను బాగా ఎరిగిన రావుకైనా జ్ఞానం లేకపోయినందుకు ఏడవాలో నవ్వాలో తెలియలేదు. మా కష్టాలకు వాళ్ళు సానుభూతిని మా ఆకలికి వారు పరితపిస్తున్నారట. కాని మమ్మల్ని అన్ని విధాలా - చివరకు అబద్ధ ప్రకటనలుకూడా చేసి - అణిచిపెట్టారు. కమ్యూనిస్టులు ఏదో ఒరగబెట్టకపోయినా వారుకూడా మాకు వ్యతిరేక ప్రచారం చేస్తే పురిట్లోనే సంధికొట్టేది ఆమాటంటే "కమ్యూనిస్టులు మీపక్షం రాబట్టే ప్రభుత్వానికి మీ రంటే సానుభూతిలేదు" అంటాడు రావు. ఏది ఏదయినా అందరి తత్వాలు మాత్రం తెలిశాయి. ఇది జరిగి మూడు నాలుగుమాసాలయింది అప్పటి నుంచి నాతో అంతగా రాజకీయాలు మాట్లాడడు రావు.

మూర్తి మళ్ళీ ఈనాటికి శెలవలకొచ్చాడు. వచ్చి రెండురోజులయినా కాలేదు. "కమ్యూనిస్టుల హింసాకార్యక్రమం గురించి" సన్నగా ఊదుడు ప్రారంభించాడు రావు. అభాండం ఇవ్వాళే హోటల్లో పగిలింది.

"అలాగా" అని మూర్తి సాగతీస్తున్నాడు. కాఫీ తాగటం మేం పూర్తి చేసినా రావు ఉపన్యాసం దంచుతూనే

ఉన్నాడు. చుట్టుపక్కల కూర్చున్న వాళ్లు ఏదో భాగోతం చూస్తున్నట్లు నిర్వేరపాటు గా చూస్తున్నారు. నాకంతా అయోమయంగావుంది. "కాఫీ త్రాగరా చల్లారిపోతోంది" అన్నాడు మూర్తి. "కాఫీకేమిటే నీవొప్పుకొంటావా ఇప్పటికైనా" అని ఆ కాఫీఅంతా ఒక గుక్కలో మ్రింగి, ఏమంటావు అన్నట్లు చూశాడు నాకేసి. రావు ఎంతో విజయం సాధించాడు అన్నట్లు కనుబొమలు ఊపేస్తున్నాడు లాయరు. మూర్తి తాపీగా "అల్లాగేరా, లే, ఇంటిదగ్గర మాట్లాడుకొందాం. ఎనిమిదికూడా దాటుతోంది" అని లేచాడు. రావు గబగబా బిల్లు చెల్లించి "లాయరుగారి ఆఫీసురూముకి పోదాం" అన్నాడు.

అక్కడకి చేరామో లేదో రావు మళ్ళీ మొదలెట్టాడు. మూర్తి ఈమాటుకొంచెం ఘాటుగా "అయితే ఈ పత్రికలు రాసింది అక్షరాల నిజంట్రా" అని ఎగతాళిగా బుజాలెగరేశాడు "కాకేం నైజాంతో కమ్యూనిస్టుల కలయిక అని తాటికాయంత అక్షరాలలో ఉన్నా కనిపించటంలా" అన్నాడు. అయితే నిన్నటిదాక ఆంధ్రమహాసభ విజయాలు: ప్రజా సైన్య పరాక్రమం, గూండాల ఆహుతి అని పడ్డాయే అవికూడా నిజమేనని ఒప్పుకొంటావా?" అని మూర్తి అడిగేసరికి "కావచ్చు" అన్నాడు రావు. లాయరుగారు "అదికాదు—" అని అనుకోబోతే మూర్తి వారించి "అయితే బ్రదర్ ... కాకేం దగ్గరనుంచి కావచ్చు దాక వచ్చావు. ఇదిగో మూడో పేజీ చివర ఆ మూల చూడు. కమ్యూనిస్టులకి నైజాం సైనికులకీ ఘర్షణ' అని పడింది. మరి దీనికేమంటావు." అనేసరికి రావు తోకతెగిన నక్కలా "నీకేం తెలుసు. ఎక్కడో వున్నావు ఈ కమ్యూనిస్టులు చేసే రాక్షస కృత్యాలు తెలియక కాని తెలిస్తే ఇన్ని యక్ష ప్రశ్నలడగవు. కళ్ళ ముందరవాళ్ళ చర్యలు......" ఇంకా రావు అంటూనే ఉన్నాడు. మూర్తి అందుకొని "ఏమిటిరా ఇందాకటి నుంచి చూస్తున్నాను. ఊకదంచితే బియ్యం వస్తాయిరా? ఉన్న రేషను కాస్తా ఊడింది. సైనుపంచ, వెధవ పంచ పది రూపాయలు. చస్తున్నాం అన్నారు. వచ్చారు: అందాకానేగాని ప్రజల క్షోభ మీ కెందుకురా. ఎందుకీ బీరాలు. ఎవరి కొంప ముంచను. ప్రజల మాట వినేవాడెవడురా. నైజాంతో ఒడంబడిక యెందుకు చేసుకున్నట్లురా. ఎవరిని అడిగి అంటాం? నైజాం సరసుడా? ముస్లిమంత్రసానియా? భలేబాగు. తెలుగు పడతుల మానభంగం జరుగుతూంటే అహింసఅంటూ ఏడుస్తున్న వాజెమ్మ లెవరురా? నీవు చెప్పు? నైజాం కమ్యూనిస్టులు నిన్నటిదాక మంచి వారన్నావు నువ్వే. ఇక్కడికమ్యూనిస్టుల లాంటి వారు కారన్నావు. నైజాం తాళం పడుతున్నారన్నావు. ఇవాళ ప్లేటు మార్చావు. పైగా ఏదైనా అంటే వాళ్ళే స్త్రీలను చెరుస్తున్నారనే లాగున్నావు." అని మూర్తి లంకించుకొనేసరికి లాయరుగారు పాయింటు మాట్లాడుదామని

ప్రయత్నించాడుగాని, మూర్తి ఆగితేనా. లేస్తే మనిషి కాడు అన్నట్టుగా వున్నాడు. ఇదేదో అయేలాగుందని, "ఒరేవ్ మీ కేంరా పనీపాటా లేదు. నే ఆఫీసుకు పోవాల"ని చెప్పి మెల్లగా బయటికి జారా.

ఇంటికొచ్చి రెండు మెతుకులు తిని ఆఫీసుకు పోయానే కాని నాకు మాత్రం మహ చెడ్డ అనుమానంగా ఉంది - 'వీళ్ళు కొట్టుకు చావలేదు గదా' అని. ప్రాణం బిగబట్టి అలాగా పనిలో తలదూర్చా. టంగ్...టంగ్...మని అయిదు కొట్టటంతో బ్రదుకు జీవుడా అని సరాసరి లాయరుగారి రూముకెళ్ళా.

వీళ్ళు తస్సాగొయ్యా. పగలబడి నవ్వుతున్నారు. గుమ్మంలో కాలుపెడుతూనే "ఏమర్రోయ్. రాజీకుదిరిందా"అని రావు కేసి చూశా. "రాజీకేముంది. స్వయంగా చూస్తే ఏగొడవా ఉండదని లాయరు గారు సలహా ఇచ్చారు"అన్నాడు రావు. నాకు అనుమానమే. ఈ లాయరేదో పితలాటం పెడతాడని మూర్తికేసి చూశా. వాడూ అవునన్నట్లు తల ఊపాడు. లాయరుగారు సలహా ఎందుకిచ్చామా అన్నట్లుగా తల పంకిస్తున్నారు. అయితే వెళ్తున్నారన్నమాట" అన్నాను. "అబ్బే నువ్వుకూడా రావాలి. లాయరుగారికేదో కేసులున్నాయట. మూర్తీ నేనూ నువ్వూ వెళ్దాం. నువ్వు మాకు తోడరివిరా" అని మూర్తికేసి చూసి ఆదొరకంగా నవ్వాడు. నా కర్థమయింది. వాళ్ళిద్దరూ అక్కడ కూడా కరుచుకోకుండా నేనుండాలన్న మాట. ఎందుకైనా మంచిదనుకొని "అబ్బే నేను రాలేనురా. అదీ కాకుండా ఎంతో అనుభవమున్న లాయరుగారే రాలేకపోతే నేనెందుకురా? అసలు నేను రాను. లాయరుగారు లేకపోతే అసలా విషయమే నాదగ్గరెత్తకద్దు"అన్నాను.

చివరికి అందరం పునః పునః ఆలోచించి, లాయరుగారు విషయాలన్ని జాగ్రత్తగా కూపీతీసేటట్లు నేను సాయపడేటట్లు ఒప్పందంతో నలుగురం మరునాడే మునగాలదగ్గర సరిహద్దునాటి తెలంగాణా గ్రామానికి వెళ్దామనుకున్నాం.

* * *

సరిహద్దు దాటగానే దేవరుప్పల శివారు కనిపించింది. అదో చిన్న పల్లెలా వుంది. మమ్మల్ని చూడగానే అందరూ మా చుట్టూ మర్రిచెట్టు క్రింద గుమిగూడారు. మాటామంతీ లేకుండానే రావు ప్రశ్నల వర్షం కురిపించాడు "పగలు రజాకార్లు, రాత్రిళ్ళు కమ్యూనిస్టులు మిమ్మల్ని దోచుకుంటున్నారటగా?" "మిమ్మల్ని హింసపెట్టేది కమ్యూనిస్టులే గదా?" అని లాయరు ప్రక్కప్రక్కన అందిస్తున్నాడు. ఈ వరసని ప్రశ్నలు వేస్తోంటే "కమ్యూనిస్టులా? దోచుకోవటమా? మిమ్మల్ని మీరే దోచుకుంటారా?" అంటూ గుక్కతిరగకుండా సమాధానం చెప్పారు. మూర్తి రావుకేసి నిలకడగా చూస్తున్నాడు. ఉన్నట్టేఉండి లాయరుగారు "ఈమధ్య కమ్యూనిస్టులు నైజాంతో కలిసిపోయారటగా?" అని అడిగారు. అందరూ ఆయన్ని ఎగాదిగా చూట్టం మొదలెట్టేసరికి ఆయన మా వెనక్కి జేరి గొణుగుతున్నాడు. రోగం

కుదిరింది. అనేలా మూర్తి సిగరెట్టుతీసి ముట్టించాడు ఇంతలోనే 12 ఏళ్ళ కుర్రాడొకడు పొట్ట చెక్కలయేలా నవ్వుతూ" "నిజమే...నిజమే.. కమ్యూనిస్టులు హైద్రాబాద్ వెళ్తున్నారు... హైద్రాబాద్ ఛలో" అంటూ సైగ చేసేసరికి అందరూ "ఛలో హైద్రాబాద్" అని ఒకసారిగా నినాదాలు ఇవ్వటం ప్రారంభించారు. ఇంతలో ఆ ముసలాయన సర్దబట్టి కాని లేకపోతే కుర్రకుంకలు ఏమైనా చేసుందురు. నేను ఆ ముసలాయనతో "మేం యేదో చూసి పోదామని వచ్చామని సంగతి సందర్భాలేమిటని" అడిగాను. ఆయన గ్రామంలోకి పోదాం రండని బయల్దేర తీశాను. మాతోపాటు శివార్లో ఉన్న వారందరూ వచ్చారు.

గ్రామం పెద్దదనే చెప్పొచ్చు. ఊరి మధ్యగా చెరువుంది దాని కట్టమీదే మండపం, మండపాన్ని ఆనుకొని చెరువులోకి వంగి ఒక పెద్ద రావి చెట్టుంది. రావిచెట్టుమీద ఉన్న కొమ్ము బూర తీసి ఊదాడాయన. దాదాపు గ్రామంలో ఉన్న వారంతా అక్కడికి వచ్చారు. రావు చాలా కొత్తగా అంతా పరిశీలనగా చూస్తున్నాడు. లాయరుగారు కటకట పడుతున్నాడు. నేను మెల్లిగా సంభాషణలోకి దిగా.

ఆ ముసలాయన పేరు పుల్లారెడ్డిట. ఆ గ్రామం మీద రెండుసార్లు రజాకార్లు, గుండాలు వచ్చి పడ్డారట మొదటిసారి భయపడ్డా నెమ్మదిగా తెప్పరిల్లి వాళ్ళను తరిమి గొట్టారట ముందర వాళ్ళదగ్గరున్నదల్లా నాటు తుపాకి ఒకటే. తర్వాత తర్వాత మెల్లగా ఆయుధాలుకూడా సంపాదించారట. నలుగురు రజాకార్లు దాడుల్లో చచ్చిపోయారట. పంచాయితీ ఎన్నికలు జరిగితే పుల్లారెడ్డిని పెద్దగా ఎన్నుకున్నారట.

ఆయన్ని ఎన్ని ప్రశ్నలడిగినా విసుగు లేకుండా చెప్తున్నాడు చిరునవ్వు నవ్వి "జేగురు దిబ్బలుదాటి నక్కపల్లి దాక ఇప్పుడు మేమే" అన్నాడు. మాకుచాలా ఆశ్చర్యం వేసింది. హైద్రాబాదుకు 10 మైళ్ళదాక మూడు జిల్లాలమధ్య ఉన్నదంతా విముక్త తెలంగాణా యేనా అని.

"నైజాం ప్రభుత్వం లేదా" అడిగాను. "ప్రభుత్వంఎక్కడిది. గూండావాళ్లు వస్తూయుంటారు దెబ్బ తిరిగేస్తే పారిపోతారెధవలు" అని రెడ్డిగారనేసరికి అందరూ పకాలున నవ్వారు వాళ్ళతో పాటు మూర్తి బిగ్గరగా నవ్వుతుంటే రావు, లాయర్ ఏమనుకున్నా లోనకి నాకు మాత్రం కష్టం వేసింది.

"మీ ప్రభుత్వం ఎక్కడనుంచి పని చేస్తుందన్నాడు" రావు .

అందరూ అతనేమీ తెలియని మూర్ఖుడయినట్లు ఒకసారి చూచారు. రెడ్డిగారు "పంచాయితీ ప్రభుత్వం గాదటండీ. మా సైన్యానికి నాయకులున్నారు ఆరే దాడ్లు జరిగితే కాపాడుతారు." అన్నారు. లాయరుగారు ఉండబట్టలేనట్టు "విముక్త ప్రాంతం అంటే ఏమిటి" అన్నారు.

"పటేలులేని రాజ్యం, మొఖాసా లేని రాజ్యం, వెట్టిలేనిరాజ్యం మేందున్న గడ్డ

మా సొంతం. ఇంకా ఎందుకు మాకు మీ మే! ఇదే మా రాజ్యం. మేం విముక్తి పొందాము" అని చాలా హుషారుగా చెప్పారు.

"సరి సరి చాలా లేట్ అయింది. తిండి తిప్పలు చూసుకుందాం పోదాం పదండి" అని తిరుగుదారి తీయబోయారు రెడ్డిగారు. నే కనిపిస్తూనే ఉన్నా లాయరు మాట్లాడినా కదిలినా ఏదో అనుమానంగా చూస్తున్నారు ప్రజలంతా. మూర్తి మాత్రం ఏమీ తనకు పట్టనట్టు వింటూ కూర్చొని సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తున్నాడు. లాయరు కదల బోయేసరికి రెడ్డిగారు. "ఆగండి నర్సిమయ్య రావాలి. వస్తూనే ఉంటాడు ఈ పాటికి" అన్నారు.

చూశావా వీళ్ళంతా కమ్యూనిస్టులైతే అనేలా చూశాడు రావు. తప్పను ఏదో రాక్షసం చేస్తారు అనేలా లాయరు చూపులు వణుకుతున్నాయి.

ఇంతలోనే పది పదిదాకా వుంటారు వచ్చారు. రైతుల లాగానే ఉన్నారు. భుజాన మందుగుండు పోసిన సంచులు వ్రేలాడుతున్నాయి. అందరి చేతుల్లోనూ బాణాకర్రల్లాంటి దిట్టమైన నల్ల కర్రలు మెరుస్తున్నాయి. నలుగురి చేతుల్లో మాత్రం తుపాకులున్నాయి. అందులో ఒకటే చాలా కొత్తగా కనిపిస్తోంది. వాళ్ళొచ్చేసరికి అందరు "నర్సిమయ్య జిందాబాద్" అని జయ్ జయ్‌లు కొట్టారు. రెడ్డిగారు నర్సిమయ్యకు మమ్మల్ని చూపించారు.

నర్సింహయ్య నడికారి. బలమైన వాడనే చెప్పొచ్చు. చూపులోనే ఆకర్షణ ఉంది కాని కోరమీసం మాత్రం కొంచెం అదురు పుట్టిస్తుంది.

"మిమ్మల్ని కష్టపెట్టినందుకు క్షమించండి" అంటూనే గ్రామస్థులందరికీనీ సాయంకాలం కలుసుకుంటానని చెప్పి పంపాడు. మమ్మల్ని గ్రంథాలయానికి పోదాం రమ్మని తీసుకెళ్ళాడు.

అదొక చావిడి. ఒకటే చెక్కలు కొట్టిన బీరువా ఉంది. దాంలో చాలా మటుకు రాజకీయాలకు సంబంధించిన పుస్తకాలు, నవలలు ఉన్నాయి. ఎప్పటిదో నాలుగు రోజుల క్రితం దినపత్రిక చాపమీద పడేసి ఉంది. చావిడిచుట్టూ కంచికంపతో దిట్టంగా దడికట్టి ఉంది. మాతో పాటు నలుగురు యువకులు కూడా వచ్చారు. తీరా నోట్లో పెట్టి... ఏదో తలో దనతో లాయరు కంగారు పడుతున్నారు. మూర్తి బెల్లం కొట్టిన రాయిలా ఉన్నవాడల్లా నర్సింహయ్యతో హుషారుగా మాట్లాడుతున్నాడు. రావు మాత్రం అంతా ఏమిటో జీర్ణించుకుంటున్నట్టుగా ఎడంచేయి చిటికినవేలు ఆడిస్తున్నాడు.

కొంచెం సేపట్లో మాకు భోజనం వచ్చింది. లాయరుగారి బలవంతంమీద నర్సింహయ్యకూడా మాతో పాటే భోం చేశాడు. లాయరుకు భోజనం సరిగా లేదు. రావు, మూర్తి మాటలు వింటూ ఏదోలా తిన్నాడు. మూర్తి నర్సింహయ్య గూర్చి అంతా అడిగి తెలుసుకుంటున్నాడు.

నర్సింహయ్య వరంగల్ లో చదువుకున్నాడు. చదువుతుండగానే 1930 స్వ సత్యాగ్రహంలో పాల్గొని రెండేళ్ళ

జైలుకు పోయాడు. తిరిగివచ్చింతర్వాత చదువు చాలించి యింటిదగ్గరే ఉంటూ ఆంధ్రమహాసభలో పనిచేసేవాడు. 1940లో మితవాదులు చీలికలు పెట్టాలని ప్రయత్నించినా, అతనుమాత్రం అందరిలో కలిసి పనిచేస్తూనే వున్నాడు 1941లో దేశముఖు ప్రతాపరెడ్డికి వ్యతిరేకంగా రైతుల్ని నడిపితే దొంగకేసు బనాయించి 4 సం॥ జైలుకు పంపాడు అమీన్. తిరిగివచ్చే సరికి ఆంధ్రమహాసభ పోరాటానికి పిలుపిచ్చింది స్టేటుకాంగ్రెసుకలిసిరాకపోయినా పోరాటం సాగుతూనే వచ్చింది అతను అందరిమధ్య ఐక్యత కావాలని తహతహపడ్డాడు వృధాశ్రమయింది. చివరికి రెండు సం॥ల పోరాటం తర్వాత స్టేటు కాంగ్రెసు వారు కూడా పోరాటం అన్నారు. బహిరంగంగా కాకపోయినా చాటుగా అయినా నువ్వు చెప్పిందే నిజంరా నర్సింహం అనేవారట కాంగ్రెసు మిత్రులు. యూనియన్ ప్రభుత్వంమీద పెట్టుకున్న ఆశలు యథాతథపు ఒడంబడికతో ఆడియాసలయాయి. 'ఆపలేక మద్దెలి ఓటి' అన్నట్టు, యిప్పుడు కమ్యూనిష్టులు నైజాంతో కలిసిపోయారంటున్నరు ఎన్ని అన్నా ఎక్కడో వాగి తేపేపర్లుకొక్కిరించాల్సిందే కాని ప్రజలమధ్యకొస్తే వారి బండారంకాస్తా బయటపడుతుంది.

ఇంకా యేవేవో చెప్తునేవున్నాడు నర్సింహయ్య. మూర్తి రావుని హెచ్చరిస్తున్నట్లుగా మధ్యమధ్య వ్యాఖ్యానాలు చేస్తున్నాడు. లాయరుగారు ఈ సోదంతా ఏమిటి పాయింటులేకుండా అనుకున్నట్లున్నారు. "అయితే మీరు కమ్యూనిస్టులయ్యారా?" అన్నారు "అబ్బే నేనలా. కాంగ్రెసే నన్ను కమ్యూనిష్టుని చేసింది." అని నవ్వుతూ సమాధానంచెప్పి యిప్పుడే వస్తానని వెళ్లాడు.

రావు యేమీ పలకటంలేదు. ఆలోచనలో పడ్డట్టున్నాడు. ఇంతలోనే అంకర్ని వెంటపెట్టుకుని నర్సింహయ్య వచ్చాడు. ఆ తాలూకాలో యెన్ని గ్రామాలమీద పోలీసులూ గూండాలు దండయాత్రలు చేశారో యెంత విలువగల సొమ్ములు దోచుకున్నారో మొదలగునవన్నీ వున్న కొన్ని కరపత్రాలిచ్చాడు నర్సింహయ్యగారు. రావు అతి జాగ్రత్తగా చదువుతున్నాడు. "80 మంది స్త్రీల మానభంగం" అని అతని పెదవులు వణికాయి.

ఇంతలోనే లాయరుగారు పుల్లారెడ్డి గారి కేసి చూసి "యూనియన్ సైన్యాలొస్తే నైజాం లొంగిపోతాడు తెలుసా" అన్నారు. "వారితో దేశముఖు ప్రతాపరెడ్డి కూడా వస్తారను తాతా" అని ఒక అమ్మాయి పక్కన నవ్వింది.

ఆ అమ్మాయిపేరు సీతట. నర్సింహయ్య కూతురట. ఇదివరదాక హైద్రాబాద్‌లో మేనమామల ఇంట్లోవుండి చదువుకునేదట. అక్కడా ఒకటే గోలగా ఉందని వాళ్లమ్మ పోరుపెట్టి ఇంటికి తీసుకొచ్చిందట. చూస్తే కొంచెం కారంపాలు ఎక్కువగా ఉన్న పిల్లలావుంది. అన్నది అన్నట్లు ఉరుకోక "భలే సైన్యాలులే పోటుసత్యాన్ని నిజాం కప్పగించినవేనా...తాతోయి పొలాలకి ఎరువెయ్యకండేం. ఎల్లాగో వాళ్ళు ఆ వచ్చినోళ్ళ కిచ్చేస్తారట..."అని వస

బోసిన పిట్టలా మొదలెట్టింది. రావుకు కొంచెం కష్టం కలిగినట్లుంది. "ఎవరో చెప్పారు. పొలాలు తిరిగిచ్చమని" అన్నాడు. "వో! చెప్పాలేంటి. మొన్నేగా దేశముఖు మతం పుచ్చుకున్నాడు" అంటి చటుక్కున. లాయరుగారు "నైజా రాజీ పడ్డా మీరు లొంగరా" అన్నారు. "లొంగేందుకేముందండీ. మేం బ్రతకాలనుకున్నాం. బ్రతకటం నేర్చుకున్నాం. బ్రతుకుతాం కూడానూ" అన్నాడు సర్వయ్య. ఇంకో యువకుడికేసి చూస్తూ "యూనియన్ ప్రభుత్వానికి ఆయుధాలెన్నున్నాయో మీకు తెలుసా" అన్నారు లాయరుగారు. "ఇప్పుడెందుకు తెలుస్తుంది. అవి మా చేతులోకొస్తాయిగా. అప్పుడు జాగ్రత్తగా లెక్కపెడతాము లెండి" అన్నాడా యువకుడు.

దాంతో మరి కడుపుడికి "ప్రభుత్వాన్ని హింసతో కూలద్రోయాలనటం ఇక్కడణచకపోతే మా ప్రాంతాలకుకూడ ప్రాకదూ?" అని మూతి సాగదీసాడు లాయరు. "ఇక్కడిలా అక్కడ దున్నేవానికి పొలం, పనిచేసేవానికి ఫలితం లేకపోతే, ఇక్కడిలాగే అక్కడా జరుగుతుంది. తిర్గిమేం బజాయనవెడ్తావుంటే .."

"అహింసా ఖాద్ అని కేక పెట్టాడు మూర్తి అతని గొంతులో రావు కంఠం కూడా వినిపించింది నాకు. వెళ్ళొస్తామని సెలవు తీసుకుని బయలుదేరాం ఇంకా శివార్లు దాట్లి-అప్పుడే బుర్రున రిజర్వు వాన్ మాదగ్గర దిగింది. లాయరు గారు ఎంతో సంతోషించారు. మన యూనియన్ వానే అది అయినందుకు ఆయన సంతోషం పెదవులు దాటకుండానే" "ఏం...ల్లారా సరిహద్దుదాటి పారి వస్తున్నారా?" అంటూనే మమ్మల్ని వాన్‌కి రిజర్వు మధ్యకుక్కారు. మేమగ్రానిఎంత మొత్తుకున్నా లాభం లేకపోయింది. వారికి తెలుసట మేమెవర్నిచంపిందీ. రామారావు తను కాంగ్రెసని చెప్తున్నా వినకపోగా 'మాకు తెలుసులే' అంటూ నోరు మూశాడు. లాయరుగారు వారికి సాయింటుతర్వాత సాయింటుగా చెప్పాలనుకున్నారు. కాని గొంతుతడి ఆరిపోయింది. నిలువెల్ల చెమటలు క్రక్కుతున్నాయేమో ఏమో కదలకుండా పడున్నారు. మూర్తి నిశ్చలంగా పొలాల్లోకి చూస్తూన్నాడు. పొలాల్లోంచి 'ఛలో హైదరాబాద్' అని పుడమి అంతా గర్జించే సరికి చేలికి పడి చూశాం. దేవురుప్పల శివార్ల మీదగా నల్లగొండ రోడ్డున రిజర్వు వాన్ దూసుకుపోతోంది. 'ఛలో హైదరాబాద్' మా చెవుల్లో రివ్వ్వుమంటోంది.